ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :184 బుధవారం ఏప్రిల్ 29 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# ఇంధనం సంక్షోభం...

●తెలుగు రాష్ట్రాల్లో బంకుల వద్ద భారీ క్యూలు
●చమురు సరఫరాలో అంతరాయం – ఆందోళనలో సామాన్యులు
●తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల అత్యవసర సమీక్ష
●వదంతులు నమ్మవద్దన్న పౌరసరఫరాల శాఖ అధికారులు



ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): గత రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసులో తలెత్తిన సాంకేతిక సమస్యల వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఏలూరు, కర్నూలు వంటి నగరాల్లో అనేక చోట్ల 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మూడు గంటలకోసారి నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు తెలంగాణలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఇంధన కొరతపై వదంతులు వ్యాపించడంతో ప్రజలు భయాందోళనలకు గురై బంకుల వద్ద క్యూ కడుతున్నారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. అయితే, తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఈ వార్తలను ఖండించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెంది ఒకేసారి పెద్ద మొత్తంలో కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అనవసరంగా నిల్వ చేయడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. చమురు మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధుల ప్రకారం, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయడంలో కొన్ని రవాణా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ సీజన్ కావడం వల్ల డీజిల్ వినియోగం పెరగడం కూడా ఈ ఒత్తిడికి ఒక కారణం.




ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, చమురు కంపెనీలు సరైన సమయానికి స్టాక్ పంపకపోవడం వల్ల కొన్ని బంకులు మూసివేయాల్సి వచ్చిందని తెలిపారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు చమురు కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, రాబోయే 24 నుండి 48 గంటల్లో పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొరత దృష్ట్యా కొన్ని చోట్ల పెట్రోల్ బంకుల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం వాహనాల్లో ఉన్న ట్యాంకులకు మాత్రమే ఇంధనం పోయాలని, బాటిళ్లు లేదా క్యాన్లలో పోయవద్దని నిబంధనలు విధించారు. దీనివల్ల నల్లబజారులో ఇంధనం విక్రయించడాన్ని అరికట్టవచ్చని భావిస్తున్నారు. కర్నూలు వంటి జిల్లాల్లో కలెక్టర్లు స్వయంగా బంకులను తనిఖీ చేసి, నిల్వలను పరిశీలిస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో నెమ్మదిగా సరఫరా మెరుగుపడుతోందని సమాచారం. ఈ సమస్య కేవలం రవాణా, తాత్కాలిక డిమాండ్ వల్ల కలిగిందేనని, శాశ్వత కొరత కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రవాణాదారులు తమ సేవలను వేగవంతం చేస్తే ఈ ఇబ్బందులు త్వరలోనే తొలగిపోతాయి. ప్రజలు సంయమనం పాటించి, అవసరమైన మేరకే ఇంధనం కొనుగోలు చేయడం వల్ల ఇతరులకు కూడా ఇబ్బంది కలగకుండా ఉంటుంది. రెండు రాష్ట్రాల్లోని పౌరసరఫరాల శాఖలు చమురు కంపెనీల డిపోల నుండి నిరంతరం స్టాక్ మూవ్‌మెంట్‌ను పర్యవేక్షిస్తున్నాయి. వచ్చే రెండు రోజుల్లో అన్ని బంకుల్లో ఇంధనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది

## చర్లపల్లి, సికింద్రాబాద్ స్టేషన్ల రోడ్ల విస్తరణపై సీఎంకు కిషన్ రెడ్డి లేఖ



□మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరం
□భూసేకరణ, రోడ్ల విస్తరణపై ప్రతిపాదనలు
□సీఎం జోక్యం కోరిన కేంద్ర మంత్రి

2

## పదో తరగతి ఫలితాలు రేపు విడుదల




■మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాల ప్రకటన
■5 లక్షలకు పైగా విద్యార్థుల ఉత్కంఠ
■వాట్సాప్ ద్వారా ఫలితాల తెలుసుకునే సదుపాయం

2

## విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన



●ఐటీ రంగంలో ఏపీకి కొత్త దిశ
●విశాఖను ఏఐ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం
●కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రశంసలు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మక గూగుల్ ఏఐ డేటా హబ్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ డేటా హబ్ కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాష్ట్ర భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, మంత్రి నారా లోకేశ్ కార్యదక్షత కలిసి విశాఖను ప్రపంచ ఐటీ పటంలో అగ్రస్థానానికి తీసుకెళ్తాయని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రపంచస్థాయి నిపుణులను ఆకర్షించే




2

## కవిత వ్యాఖ్యలపై దానం నాగేందర్ ఫైర్

+రాష్ట్రంలో ప్రజా పాలననే కొనసాగుతోంది
+తల్లిదండ్రుల గౌరవంపై సూచనలు
+సీఎం కృషిని కొనియాడిన ఎమ్మెల్యే



2

## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



2

## మధుసూదన్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి మంత్రి కోమటిరెడ్డి



◆ మిర్యాలగూడలో భౌతికకాయానికి నివాళి
◆ కుటుంబ సభ్యులకు పరామర్శ
◆ అన్ని విధాలా అండగా ఉంటామని హామీ

మిర్యాలగూడ, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): డిప్యూటీ ముఖ్యమంత్రి కార్యాలయ సిపిఆర్వో మధుసూదన్ ఆకస్మిక మరణం తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మిర్యాలగూడలో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధుసూదన్‌తో దశాబ్దకాలంగా సన్నిహిత అనుబంధం ఉందని మంత్రి గుర్తుచేశారు. నల్గొండ జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా పనిచేసిన

2

# చర్లపల్లి, సికింద్రాబాద్ స్టేషన్ల రోడ్ల విస్తరణపై సీఎంకు కిషన్ రెడ్డి లేఖ




హైదరాబాద్, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): చర్లపల్లి రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల వద్ద అప్రోచ్ రోడ్ల విస్తరణ, భూసేకరణ అంశాలపై కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. నగరంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన చర్లపల్లి టెర్మినల్, పునరాభివృద్ధి చెందుతున్న సికింద్రాబాద్ స్టేషన్ వద్ద రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని లేఖలో కోరారు. గతంలో పలుమార్లు విన్నవించినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. చర్లపల్లి టెర్మినల్ పరిధిలో రోడ్ల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు వివరించారు. ఎఫ్‌సీఐ గోదాం రోడ్డును 200 అడుగులకు విస్తరించడం, భరత్ నగర్ వైపు ఉన్న రోడ్డును 100 అడుగులకు పెంచడం, ఈసీ నగర్ నుంచి ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాం వరకు రోడ్డును విస్తరించడం అవసరమని సూచించారు. అదేవిధంగా పార్కింగ్ తదితర అవసరాల కోసం భూసేకరణ చేపట్టాలని కోరారు. కొత్త భవనం వైపు 3 ఎకరాలు, ఎంఎంటీఎస్ వైపు 2.70 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రతిపాదించారు. నీటి సరఫరా కోసం రైల్వే శాఖ ఇప్పటికే నిధులు జమ చేసినందున కనెక్షన్ పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉత్తర టెర్మినల్ వద్ద కూడా రోడ్ల విస్తరణ అవసరమని తెలిపారు. ఆల్ఫా హోటల్ నుంచి రథీఫైల్ బస్టాండ్ వరకు ఉన్న రహదారిని 120 అడుగులకు విస్తరించాలని సూచించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇది ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ అంశంపై గతంలో కూడా పలుమార్లు లేఖలు రాసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఈ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధికి కీలకమైన ఈ పనులు త్వరగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పదో తరగతి ఫలితాలు రేపు విడుదల





హైదరాబాద్, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు శుభవార్త. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు రేపు విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యాశాఖ అధికారులు అధికారికంగా ఫలితాలను ప్రకటించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 23 నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయింది. ముందుగా మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటించాలని భావించినప్పటికీ, గడువుకు ముందుగానే విడుదల చేయడం విశేషంగా మారింది. విద్యార్థులకు సులభతరం చేయడానికి ఈసారి కొత్త సాంకేతిక సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. వాట్సాప్ ద్వారా ఫలితాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటికే హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులకు ఫలితాల మెమో నేరుగా మొబైల్‌కు చేరనుంది. ఇంకా ఆ సదుపాయం వినియోగించుకోని విద్యార్థులు కూడా సులభంగా ఫలితాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం 80969 58096 నంబర్‌కు 'Hi' అని సందేశం పంపాలి. ఆ తర్వాత »SSC Resultsµ ఎంపికను ఎంచుకుని, హాల్‌టికెట్ నంబర్ నమోదు చేస్తే ఫలితం వెంటనే ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ విధానం ద్వారా సర్వర్ల రద్దీ సమస్య లేకుండా వేగంగా ఫలితాలను పొందే అవకాశం ఉంది. విద్యార్థులు ఎక్కడ ఉన్నా సులభంగా తమ ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఫలితాల ప్రకటనతో విద్యార్థుల ఉత్కంఠకు తెరపడనుంది. తదుపరి విద్యా అవకాశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు ఇది కీలక దశగా నిలవనుంది.

# కవిత వ్యాఖ్యలపై దానం నాగేందర్ ఫైర్




హైదరాబాద్, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని చేసిన వ్యాఖ్యలను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖండించారు. తెలంగాణలో ప్రజా పాలన సమర్థవంతంగా కొనసాగుతోందని, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలిపారు. కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాజకీయ విమర్శలు చేయడంలో హద్దులు పాటించాలని సూచించారు. వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సముచితం కాదని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. తల్లిదండ్రులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని దానం నాగేందర్ చెప్పారు. సొంత తండ్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని సూచించారు. కుటుంబ విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కోసం కష్టపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటలు పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంపై విమర్శలు చేయాలంటే వాస్తవాల ఆధారంగా చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని దానం నాగేందర్ స్పష్టం చేశారు

# విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన




సామర్థ్యం కలిగిందని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు నాయుడు గతంలో నిర్మించిన సైబర్ టవర్స్ ఐటీ రంగానికి బలమైన పునాది వేసాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు విశాఖలో నిర్మిస్తున్న ఏఐ డేటా హబ్ రాష్ట్రానికి కొత్త గుర్తింపును తెస్తుందని అన్నారు. నారా లోకేశ్ సమస్యలను సమర్థంగా పరిష్కరించే తీరు యువ నాయకులకు ఆదర్శమని ప్రశంసించారు. అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ భవిష్యత్తులో విద్య, వైద్యం, వ్యవసాయం, ఏరోస్పేస్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని తెలిపారు. గూగుల్ క్లౌడ్ ఆధారిత ఏఐ హబ్ ద్వారా అనేక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. మొబైల్ తయారీ, ఎగుమతుల్లో దేశం ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో డేటా సెంటర్లకు అవసరమైన సర్వర్లు, చిప్‌లను దేశంలోనే తయారు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. రైల్వే రంగంలో కూడా ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధులు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్ నిర్మాణం పూర్తయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని, ఐటీ రంగంలో మరింత పురోగతి సాధిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మెదటి పేజీ తరువాయి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ధాన్యం కొనుగోలు కేంద్రాలపై కీలక ఆదేశాలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచన
- తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు



కరీంనగర్, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): కరీంనగర్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వేసవి కాలంలో తాగునీటి సమస్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో ప్రస్తుత పరిస్థితులపై ఆయన సమగ్రంగా చర్చించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీవో శ్రీధర్, ఆర్డీవో రమేష్ బాబు పాల్గొన్నారు. మండల స్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ధాన్యం తరలింపుకు వాహనాల కొరత లేకుండా చూడాలని, బస్తాల సరఫరా సకాలంలో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు పూర్తైన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లకు గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. నీటి సరఫరా వ్యవస్థలను పర్యవేక్షిస్తూ ప్రజలకు నిరంతర సరఫరా అందేలా చూడాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# మధుసూదన్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి మంత్రి కోమటిరెడ్డి




మిర్యాలగూడ, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): డిప్యూటీ ముఖ్యమంత్రి కార్యాలయ సిపిఆర్వో మధుసూదన్ ఆకస్మిక మరణం తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మిర్యాలగూడలో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధుసూదన్‌తో దశాబ్దకాలంగా సన్నిహిత అనుబంధం ఉందని మంత్రి గుర్తుచేశారు. నల్గొండ జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా పనిచేసిన సమయంలో నుంచే పరిచయం కొనసాగిందని తెలిపారు. ఇటీవల రహదారులు, భవనాల శాఖ సమీక్షలో రోడ్ల అభివృద్ధిపై ఆయనతో జరిగిన చర్చలు ఇంకా గుర్తున్నాయని చెప్పారు. చిన్న వయసులోనే మధుసూదన్ మరణం కలచివేసిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి ఈ నష్టం తీరనిదని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి ధైర్యం చెప్పి, మానసికంగా బలంగా నిలవాలని సూచించారు. మధుసూదన్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మధుసూదన్ సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించిన ముఖ్యమంత్రి

- కప్ప స్తంభం వద్ద మొక్కులు చెల్లింపు
- వేదాశీర్వచనం అందించిన అర్చకులు
- కేంద్ర, రాష్ట్ర మంత్రుల పాల్గొనడం





విశాఖపట్నం, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించారు. ఆలయంలో సంప్రదాయం ప్రకారం కప్ప స్తంభం వద్ద మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం అనంతరం దేవస్థాన అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఆచార సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వామివారిని ప్రార్థించి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత కూడా హాజరయ్యారు. అదేవిధంగా ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, గణబాబు తదితర ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులతో కలిసి వారు దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించారు. అధికారులు, దేవస్థాన సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం సజావుగా కొనసాగింది. సింహాచలం దేవస్థానం రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి దర్శనంతో భక్తుల్లో ఆనందం వ్యక్తమైంది.

# పాకిస్థాన్‌లో ఉగ్రవాదులపై అజ్ఞాత దాడులు

- వరుస హత్యలతో కలకలం
- కీలక నేతలపై టార్గెట్ దాడులు
- భద్రతా వ్యవస్థలపై ప్రశ్నలు



3

# పాకిస్థాన్‌లో ఉగ్రవాదులపై అజ్ఞాత దాడులు



తరువాయి భాగం

ఇస్లామాబాద్, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): పాకిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థలపై వరుసగా జరుగుతున్న అజ్ఞాత దాడులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు వ్యూహాత్మకంగా టార్గెట్ చేసి కాల్చిచంపి, ఎలాంటి ఆనవాళ్లు లేకుండా అదృశ్యమవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు ఉగ్రవాద సంస్థలతో పాటు పాకిస్థాన్ గూఢచార విభాగం, సైన్యాన్ని కూడా ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొద్ది రోజుల కిందట లష్కరే తోయిబా సంస్థకు చెందిన కీలక నేత షేక్ అఫ్రిది ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో కాల్చిచంపబడ్డాడు. అతను సంస్థలో అత్యంత కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తిగా గుర్తింపు పొందినవాడు. ఈ ఘటనతో అజ్ఞాత హంతకుల మిస్టరీ మరింత పెరిగింది. ఈ దాడుల వెనుక ఎవరు ఉన్నారు అనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.ఈ హత్యల పరంపర ఒకే సంస్థకు పరిమితం కాలేదు. హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఇతర సంస్థల నేతలు కూడా ఇలాగే హతమవుతున్నారు. 2026లో ఇప్పటివరకు ముప్పై మందికి పైగా కీలక ఉగ్రవాదులు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. లాహోర్, పంజాబ్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్, కరాచీ వంటి ప్రధాన ప్రాంతాల్లో ఈ ఘటనలు జరగడం గమనార్హం. ఈ వరుస హత్యలు లష్కరే తోయిబా సంస్థను బలహీనపరుస్తున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. ఇప్పటికే నాయకత్వ లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంస్థకు ఈ దాడులు పెద్ద దెబ్బగా మారాయి. కీలక కమాండర్‌గా పనిచేసిన షేక్ అఫ్రిది మరణంతో సంస్థ కార్యకలాపాలు మరింత దెబ్బతిన్నాయి.ఇటీవల మరో కీలక వ్యక్తి అమీర్ హంజాపై కూడా దాడి జరిగినట్లు సమాచారం. అతను సంస్థలో నియామకాల ప్రక్రియలో ముఖ్య పాత్ర పోషించేవాడిగా గుర్తింపు పొందాడు. ఈ దాడులతో ఉగ్రవాద క్యాడర్‌లో భయం, అనిశ్చితి పెరిగింది. అగ్రనేతలకే భద్రత లేకపోతే తమ పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలు పాకిస్థాన్ సైన్యం, గూఢచార వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఉగ్రవాదుల నమ్మకం కోల్పోవడంతో అంతర్గత సమస్యలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దృష్టి మళ్లించేందుకు పాకిస్థాన్ పెద్ద దాడులకు ప్రణాళికలు రూపొందించే ప్రమాదం ఉందని భద్రతా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

# సూరంపల్లిలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**-సూరంపల్లిలో ఎల్లమ్మ బోనాలు ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణోత్సవం ఘనంగా**



దౌల్తాబాద్ మనప్రజాప్రతినిధి//ఏప్రిల్ 28): దౌల్తాబాద్ మండల కేంద్రంలోని సూరంపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ సమేత జమదగ్ని స్వామి వారి కళ్యాణ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.ఈ మహోత్సవానికి సూరంపల్లి గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుండి భారీ సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కిలకిలారావాలు, దైవ నామస్మరణతో గ్రామం మార్మోగిపోయింది.కార్యక్రమంలో భాగంగా భక్తులకు విస్తృతంగా అన్నదానం నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి కూడా తగిన సౌకర్యాలు కల్పించడంతో పండుగ నిర్వహణపై గ్రామస్థులు, గౌడ సంఘం సభ్యులు ప్రశంసలు అందుకున్నారు.అలాగే ఈ వేడుకల్లో సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఒగ్గు కథల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకోగా, పోతురాజుల వేషధారణలు ఉత్సాహాన్ని నింపాయి. ఈ కళారూపాలు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ పండుగకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చాయి.

# రక్షణ ఖర్చుల్లో భారత్‌కు ఐదో స్థానం

□ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం పెరుగుదల

□అగ్రస్థానంలో అమెరికా

□యూరప్ ప్రభావం స్పష్టంగా వెల్లడి





న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): ప్రపంచ దేశాల్లో రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. గడిచిన 2025 సంవత్సరంలో భారత్ సుమారు 92.1 బిలియన్ డాలర్లను రక్షణ రంగానికి కేటాయించింది. అమెరికా, చైనా, రష్యా, జర్మనీ దేశాలు భారత్ కంటే ముందు స్థానాల్లో ఉన్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఈ వివరాలను స్వీడన్ దేశానికి చెందిన స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం 2.9 శాతం పెరిగి 2,887 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచ దేశాలు భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ సైనిక ఖర్చులను పెంచుతున్నట్లు వెల్లడైంది. భారత్ రక్షణ వ్యయం 2024తో పోలిస్తే 8.9 శాతం పెరిగి 92.1 బిలియన్ డాలర్లకు చేరింది. దీని ద్వారా ప్రపంచంలో అత్యధికంగా రక్షణ రంగంపై ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ ఐదో స్థానాన్ని సంపాదించింది. దేశ భద్రతా అవసరాలు, సాంకేతిక ఆధునీకరణ చర్యలు ఈ పెరుగుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు.అమెరికా 954 బిలియన్ డాలర్ల వ్యయంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. చైనా 336 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో రష్యా 190 బిలియన్ డాలర్ల ఖర్చుతో మూడో స్థానంలో నిలిచింది. జర్మనీ 114 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం పెరగడంలో యూరప్ కీలక పాత్ర పోషించినట్లు నివేదిక వెల్లడించింది. యూరప్ దేశాలు తమ రక్షణ వ్యయాన్ని 14 శాతం పెంచి మొత్తం 864 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాయి. భద్రతా పరిస్థితుల మార్పు ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు.పాకిస్థాన్ కూడా తన రక్షణ వ్యయాన్ని పెంచింది. 11.9 బిలియన్ డాలర్ల ఖర్చుతో ఆ దేశం జాబితాలో 31వ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ రంగంపై ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

# చైల్డ్ సేఫ్టీ, డ్రగ్స్ నివారణ పై మానవహారం





మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 28:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో చైల్డ్ సేఫ్టీ, డ్రగ్స్ నివారణలో భాగంగా మంగళవారం ర్యాలీ మరియు మానవహార కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వేదికగా 'బాల్య వివాహాల నిర్మూలన', బాలల సంరక్షణ లక్ష్యంగా భారీ మానవహారం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంపీడీవో టి. చిన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చేగుంట పాలకవర్గం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు,కిశోర బాలికలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో . చిన్నారెడ్డి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తాసిల్దార్ శివప్రసాద్, పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇది బాలల సంరక్షణ చట్టాలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా, లేదా బాలలు ఇబ్బందుల్లో ఉన్నట్లు గమనించినా వెంటనే 1098 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో తాసిల్దార్ శివప్రసాద్, ఎస్ ఐ 2బిక్య నాయక్, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్,ఉప సర్పంచ్ రఫీ,, ఐకెపి ఎపిఎం దుర్గ ప్రసాద్ , ఇజిఎస్ ఎపిఓ, హౌసింగ్ ఎఇ రియాజుద్దీన్,హెల్త్ సూపర్వైజర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు, ఐకెపి సీసీలు, చేగుంట జిపి సిబ్బంది,విఓఏ లు, అంగన్వాడీ టీచర్లు కిశోర బాలికలు పాల్గొన్నారు

# పెళ్లి ఇంట విషాదం....



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 28,:మెదక్ జిల్లాలో పెళ్లి ఇంట్లో విషాదం నెలకొంది. చేగుంట మండలం చిట్టోజిపల్లి గ్రామంలో యువకుడు చాకలి రమేష్ (19) బావిలో పడి చనిపోయారు. రాము చెల్లెలి పెళ్లి జరగ్గా, విందుకు వెల్లాల్సి ఉంది. ఈ క్రమంలో స్నానం కోసం ఊరి సమీపంలోని కృష్ణ శామల వ్యవసాయ భూమిలో గల, ( ఫామ్ పౌండ్)నీటి స్టోరేజీ గుంతలో స్నానం చేయుటకు వెల్లిన రమేష్ .. కాలుజారి అందులో పడి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. వేడుకలుజరగాల్సిన ఇంట్లో మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, తల్లి చాకలి నర్సవ్వ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.

# రోడ్డు అద్వానం,రాకపోకలకు నరకం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 28: చేగుంట రెండు నియోజకవర్గాన్ని కల్పే బీటి రోడ్లు అద్వానంగా మారాయి ప్రయాణానికి వీలు లేకుండా ఉండడంతో రోజు ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుబ్బాక నియోజకవర్గం లోని చేగుంట మండలం పులిమామిడి నుంచి, మెదక్ నియోజకవర్గం లోని నిజాంపేట్ మండలం నార్లాపూర్ వరకు,బీటి రోడ్డు ఉంది. ఈ మార్గంలో నిత్యం కార్లు,ఆటోలు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి కానీ ఈ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తారు పోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. చేగుంట మండల ఇదివరకు దారి మళ్ళీ ఇబ్బందికరంగా ఉన్న, అధికారులు చర్యలు చేపట్టడం లేదు, గత 15 ఏళ్ల క్రితం వేసిన తారు రోడ్డు చాలాచోట్ల కంకర తేలింది. పగటిపూటనే ప్రయాణం కష్టంగా ఉంటుంది. ఇక రాత్రి వేళలో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# శీనన్న ఆధ్వర్యంలో....

## అనంతు రాంబాబు గౌడ్ ను పరామర్శించిన గ్రామవాసులు

◆లాల్ లక్ష్మీపురం గ్రామ వాసి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అనంతు రాంబాబు గౌడ్ కు,పండ్ల పంపిణీ చేసి పరామర్శించిన గ్రామవాసులు..

◆గత నెల రోజుల క్రితం కాలుకు ఇన్ఫెక్షన్ అవడంతో విషయం తెలుసుకున్న గంజాయి శీను గ్రామ వాసులను పంపించి ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు..





మనప్రజాప్రతినిధి//నేరేడుచర్ల:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండలం లాల్ లక్ష్మీపురం గ్రామ వాసి అనంతు రాంబాబు గౌడ్ ను పరామర్శించి గ్రామ వాసులు.గత నెల రోజుల క్రితం కాలుకు ఇన్ఫెక్షన్ అవడంతో విషయం తెలుసుకున్న గంజాయి శీను గ్రామ వాసులను పంపించి ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.3వ వార్డ్ నాయకురాలు పెద్దదనమ్మ,శ్రీపాటి వెంకన్న,యాడవెల్లి యాదగిరి, వానరసి మలుసురు, గంజాయి పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# లాల్ లక్ష్మీపురంలో...

## వీధి లైట్స్ సమస్య తీరేది ఎప్పుడు





మనప్రజాప్రతినిధి//నేరేడుచర్ల:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండలం లాల్ లక్ష్మీపురం గ్రామంలో 8వ వార్డ్ లో వీధి లైట్స్ సరిగ్గా పనిచెయ్యక పోవడము తో రాత్రి పూట పాములతో భయపడుతున్న జనాలు నిమ్మకు నిరీత్తినట్లు వ్యవహారిస్తున్న గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ అధికారులు,పంచాయతీ కార్యదర్శికి, పలుమార్లు ఇట్టి సమస్య గురించి గ్రామస్తులు చెప్పిన కూడా, ఈరోజు చేస్తాం రేపు చేస్తాం అని పెడ చెవిన పెడుతూ కాలయాపన చేస్తున్నారు. దయచేసి ఇప్పటికైనా స్పందించి వీధి లైట్స్ ల సమస్య పరిష్కరించకపోతే, జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని 8వ వార్డుప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇన్ని రోజులేమో ప్రత్యేక అధికారుల పరిపాలనలో నిధులు లేక అస్త వ్యస్తంగా ఉండేది,ప్రస్తుతం కొత్తగా వచ్చిన సర్పంచ్ ల పరిపాలన బాగుంటదంటే ఏడేసిన గొంగడి ఆడనే అన్నట్టు వుంది, ప్రస్తుతం వున్న సర్పంచ్ ల పరిపాలన విధానం, ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇస్తుందని, సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే ను జయప్రదం చేయండి

**-వాడ వాడలా ఎర్రజెండాలను ఎగురవేయండి.**

**-పోకల వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**





గరిడేపల్లి (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )ప్రపంచ కార్మికుల పర్వ దినం మే - డే ను జయప్రదం చేయాలని, మండలం లోని అన్ని గ్రామాలలో ఎర్రజెండాలను ఎగుర వేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, పార్టీ శ్రేణులకు,కార్మికులకు పిలుపునిచ్చారు. గరిడేపల్లి మండలంలో ఈ రోజు సిపిఐ మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని అన్ని గ్రామాలలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్మికులు, సిపిఐ కార్యకర్తలు, ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను వాడ వాడలా గ్రామ గ్రామాన ఎర్రజెండాలు జెండాలని ఎగరవేసి మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య ఏఐటీయూసీ జిల్లా నాయకులు త్రిపురం సుధాకర్ రెడ్డి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు,యడ్ల అంజిరెడ్డి,కుందూరు వెంకటరెడ్డి, చేవ్వా వెంకన్న, మామిడి శ్రీను, పోకల ఆంజనేయులు, పందిరి నాగయ్య,ప్రతాని సైదులు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు పంగ సైదులు, మెండే లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తాళ్ల తిరపయ్య, వేశాల ఆంజనేయులు,గోవిందు,నబిసాహెబ్, తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయండి



మఠంపల్లి( మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):ప్రపంచ కార్మిక పర్వ దినోత్సవం అయిన మేడేరు జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు మఠంపల్లి మండల సిపిఐ కార్యదర్శి అమరారపు పున్నయ్య విజ్ఞప్తి చేశారు మంగళవారం నాడు సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో వారు పాత్రికేయులతో మాట్లాడుతూ కార్మిక శక్తిని యాజమాన్యాలు దోపిడీ చేసుకుంటున్న తరుణంలో రోజుకు 18 గంటలు పని చేయిస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ కార్మికులు కుటుంబం తో కలిసి గడపడానికి వీలులేని పరిస్థితులు ఉన్న సందర్భంలో దోపిడీకి పీడన కు వ్యతిరేకంగా 1886 సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలో మొట్టమొదటిసారిగా కార్మికులు సమ్మె చేస్తే ఆగ్రహించిన యాజమాన్యం కార్మికుల ఐక్యతను చెదరగొట్టేందుకు వారిపై విచక్షణా రహితంగా లాఠీచార్జ్ జరిపి కాల్పులు జరిపి అనేక మంది ప్రాణాలు బలితీసుకున్నారని అట్టి సందర్భంలో కాలువలై పారుతున్న కార్మిక రక్తంలో ముంచిన జండానే మన ఎర్రజెండా అని వారు అన్నారు ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రతి సంవత్సరం మే 1వ తేదీన కార్మిక ఐక్యతకు చిహ్నంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికులు మే డే పర్వ దినోత్సవం జరుపుకుంటారని అందులో భాగంగా మఠంపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో సిపిఐ మరియు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు జరుపుతున్నామని వారు తెలిపారు సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీలో పార్టీ జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొంటారని విద్యార్థి యువజన కార్మిక మహిళ రైతు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు వారి వెంట మాజీ ఎంపిటిసి లాల్యానాయక్, వరదాపురం వార్డ్ మెంబర్ అమరారపు మట్టయ్య కంటూ మట్టయ్య రఘునాధపాలెం శాఖ కార్యదర్శి జలాలుద్దీన్ రైతు సంఘం నాయకులు కోటిరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు ఉన్నారు

# రక్షణ ఖర్చుల్లో భారత్‌కు ఐదో స్థానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (మనప్రజాప్రతినిధి): ప్రపంచ దేశాల్లో రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. గడిచిన 2025 సంవత్సరంలో భారత్ సుమారు 92.1 బిలియన్ డాలర్లను రక్షణ రంగానికి కేటాయించింది. అమెరికా, చైనా, రష్యా, జర్మనీ దేశాలు భారత్ కంటే ముందు స్థానాల్లో ఉన్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఈ వివరాలను స్వీడన్ దేశానికి చెందిన స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం 2.9 శాతం పెరిగి 2,887 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచ దేశాలు భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ సైనిక ఖర్చులను పెంచుతున్నట్లు వెల్లడైంది. భారత్ రక్షణ వ్యయం 2024తో పోలిస్తే 8.9 శాతం పెరిగి 92.1 బిలియన్ డాలర్లకు చేరింది. దీని ద్వారా ప్రపంచంలో అత్యధికంగా రక్షణ రంగంపై ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ ఐదో స్థానాన్ని సంపాదించింది. దేశ భద్రతా అవసరాలు, సాంకేతిక ఆధునీకరణ చర్యలు ఈ పెరుగుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు.అమెరికా 954 బిలియన్ డాలర్ల వ్యయంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. చైనా 336 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో రష్యా 190 బిలియన్ డాలర్ల ఖర్చుతో మూడో స్థానంలో నిలిచింది. జర్మనీ 114 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం పెరగడంలో యూరప్ కీలక పాత్ర పోషించినట్లు నివేదిక వెల్లడించింది. యూరప్ దేశాలు తమ రక్షణ వ్యయాన్ని 14 శాతం పెంచి మొత్తం 864 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాయి. భద్రతా పరిస్థితుల మార్పు ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు.పాకిస్థాన్ కూడా తన రక్షణ వ్యయాన్ని పెంచింది. 11.9 బిలియన్ డాలర్ల ఖర్చుతో ఆ దేశం జాబితాలో 31వ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ రంగంపై ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు

